ప్రజాశక్తి
శుక్రవారం 10 జనవరి 2025
5
కర్నూలు

ప్రయివేట్ దోపిడీ

- బస్సుల్లో ఇష్టారాజ్యంగా ఛార్జీల వసూలు
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- ఛార్జీల నియంత్రణలో అధికారులు విఫలం

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. సంక్రాంతి పండుగతో పాటు వరుస సెలవులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాకా తప్పడం లేదు. పండుగ సీజన్లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీల వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆర్టీసీలో ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలు వసూలు చేస్తుంటే ప్రయివేటు ట్రావెల్స్ మాత్రం మామూలు సర్వీసుల్లోనే అదనపు ఛార్జీ వసూలు చేసేస్తున్నారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీలో సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్లో రూ.1500 వరకు, ఎసి సీటర్లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకు, ఎసి స్లీపర్లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. సంక్రాంతి పండుగ సెలవులు కావడంతో కర్నూలు నుంచి హైదరాబాద్ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్ఆర్టీసీలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకు, ఎసి స్లీపర్లో రూ.1100 నుంచి రూ.2990 వరకు వసూలు చేస్తున్నారు. కర్నూలు నుంచి విజయవాడకు ఆర్టీసీ సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్లో రూ.858 వరకు వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసీ స్లీపర్లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకు ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్లో రూ.800 నుంచి రూ.1090 వరకు వసూలు చేస్తున్నారు. పండుగల నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు పలు మార్గాల్లో నిరంతరం ప్రత్యేక తనిఖీలు చేయాల్సి ఉంది. ఎక్కువ మొత్తంలో ఛార్జీలు వసూలు చేసినా, బస్సులకు ఫిట్నెస్ లేకపోయినా జరిమానా విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రయివేటు బస్సుల్లో అధిక ఛార్జీల వసూలును నియంత్రించడంలో రవాణా శాఖ అధికారులు విఫలం అయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బ్లాక్లోనూ టికెట్లు

పండగ సీజన్లో ఊరికెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్లైన్లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

క్యాన్సర్పై అవగాహన పెంచాలి

- డాక్టర్ శైలేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ శైలేష్ కుమార్ అన్నారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ లెక్చరర్ గ్యాలరీలో హై రిస్క్ ప్రెగ్నెన్సీపై ఇంటిగ్రేటెడ్ మేనేజ్మెంట్, ట్రాకింగ్ పై పట్టణ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వార్డ్,గ్రామ మహిళా ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు, డాక్టర్ శైలేశ్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, 18 యేళ్ల దాటిన వారందరికి రక్తపోటు, మధుమేహము, రక్తహీనత పరీక్షలు, 30 యేళ్ల దాటీనా వారందరికి రొమ్ము, నోటి, గర్భాశయపు ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేయాలని తెలిపారు. అతిగాబరువు తగ్గడం, జ్వరం, అలసట, శరీరంలో మార్పులు, అసాధారణ రక్త స్రావం, మలమూత్ర విసర్జనలో మార్పులు, మానని పుండ్లు, రుతుక్రమంలో మార్పులు, రొమ్ములో గడ్డలు, జీర్ణ సంబంధమయిన సమస్యలు, మింగుటలో ఇబ్బంది, పుట్టు మచ్చలలో మార్పులు, బొంగురు గొంతు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారికి తెలపాలన్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. క్యాన్సర్ వ్యాధికి ముందస్తు పరీక్షలు చేయించుకొని గుర్తిస్తే వ్యాధి నయమవుతుందని అన్నారు. ప్రజలందరికీ ఈ వ్యాధులపట్ల అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. డిపిహెచ్ఎన్ఒ కె.అన్నపూర్ణ, ప్రశాంత్ స్టేట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్, పిహెచ్ఎన్ మీనాక్షి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఎంపిహెచ్ఇఒ మూర్తి, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శైలేష్ కుమార్. హాజరయిన సిబ్బంది

అంతరిక్ష పరిజ్ఞానం పెంచుకోవాలి

- విసి సాయిగోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఇచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అంతరిక్ష శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు సాగాలని వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్ సూచించారు. గురువారం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆన్లైన్లో అందిస్తున్న సైన్సు ప్రోగ్రాం క్లస్టర్ యూనివర్సిటీ నోడల్ కేంద్రమైన కెవిఆర్ కళాశాలలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఈ అవకాశాన్ని ఇవ్వడం ద్వారా ఇక్కడ విద్యార్థులకు ఒక వరమని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని అంది పుచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ కుమార్ గౌరవ అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కొత్త టెక్నాలజీ గురించి తెలుసుకో వాలన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్, నోడల్ సెంటర్ అధ్యక్షులు ఎం.పద్మావతి మాట్లాడుతూ... క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థులు వంద మంది హాజరయ్యారని, కర్నూలు జిల్లా నుండి మొత్తం 300 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో 200 మందిని నోడల్ సెంటర్ నుండి సెలెక్ట్ చేశామన్నారు. వారికి గురువారం నుండి ఈ నెల 29 వరకు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ గురించి పూర్తిగా అవగాహన కలిగేలా శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 29న ఈ కోర్సులో ట్రైనింగ్ తీసుకున్న విద్యార్థులకు పరీక్ష జరిపి ఉత్తీర్ణులకు ఇస్రో నుండి సర్టిఫికెట్స్ ఇస్తామని కోఆర్డినేటర్ తెలిపారు. కెవిఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.దేవికారాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్, నోడల్ సెంటర్ అధ్యక్షులుగా ఎం.పద్మావతి వ్యవహరించారు. ఈ కార్యక్రమములో క్లస్టర్ యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

20 నుంచి రీ సర్వే

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 20 నుండి రీ సర్వే ప్రాజెక్టు కింద జిల్లాలో సర్వే కార్యక్రమం ప్రారంభం కానున్నదని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లో మండల సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్లకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అవగాహన సదస్సు నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 20 నుండి ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద జిల్లాలోని 25 మండలాలలో 25 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకుని సర్వే చేపడుతున్నామన్నారు. ఆర్డిఒల ఆధ్వర్యంలో రీ సర్వే పై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులను గుర్తించి గ్రామంలోని అన్ని ప్రభుత్వ భూములను గుర్తించే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాన్ని 200 నుండి 250 ఎకరాల బ్లాక్లుగా విభజించాలన్నారు. ప్రతి గ్రామానికి గ్రామ విస్తీర్ణాన్ని బట్టి 3 నుండి 4 బృందాలను కేటాయించాలన్నారు. ప్రతి బృందం 2 విలేజ్ సర్వేయర్లు, 1 విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఒక విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు కలిగి ఉండాలన్నారు. పై బృందాలతో పాటు, ఆ గ్రామంలో పని చేస్తున్న ఒక విలేజ్ సర్వేయర్, ఒక విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ తో ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా కమ్యూనికేషన్ ప్రయోజనం కోసం ఒక ప్రత్యేక బృందాన్ని నియమించాలన్నారు. ఎక్కడ సమస్య ఉత్పన్నమైనా వారు హాజరు కావాలని జిల్లా సర్వే అధికారిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి మునికన్నన్, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

సమావేశంలో మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

చేపపిల్లల సరఫరాకు టెండర్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో చేపపిల్లల సరఫరా కోసం టెక్నికల్ , ఫైనాన్షియల్ సీల్డ్ టెండర్ ప్రక్రియకు గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లాలో మత్స్య రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా కీలకమైన అడుగుగా నిలిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ బిఎస్. నవీన్ కుమార్ , జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య , డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ శ్యామల , మత్స్యకార సిబ్బంది పాల్గొన్నారు. చైర్మన్ బిఎస్. నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ టెండర్ ప్రక్రియ ద్వారా నాణ్యమైన చేపపిల్లలను సరఫరా చేసి మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడం, సమగ్ర అభివృద్ధికి సహకరించడం లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య మాట్లాడుతూ, మత్స్యరంగానికి ప్రభుత్వ నుంచి అందుతున్న సాయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ఎంతో ముఖ్యమని, చేపపిల్లల సరఫరా పథకం జిల్లాలో మత్స్య వనరుల పెంపొందించుటకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల శ్రేయస్సు కోసం తీసుకుంటున్న చర్యలు జిల్లాలో మత్స్యరంగం అభివృద్ధికి సహాయపడతాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

- డ్వామా పీడీ వెంకటరమణయ్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలకు పని కల్పనలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరమణయ్య హెచ్చరించారు. గురువారం కర్నూలు నగర సమీపంలోని జగన్నాథ గట్టు వద్ద జిల్లా శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణ తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బంది మానవత్వంతో పని చేయాలన్నారు. గ్రామాలలో పని కోరిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. పథకం ద్వారా చేపట్టిన ప్రతి పని సుస్థిర ఆస్తులుగా నిలవాలన్నారు. పేదలకు పనులు కల్పించడంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పనులు గురించి చైతన్య పరచి నిత్యం రూ.300 వేతనం పొందే లాగా పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి లక్ష్మన్న, కోర్స్ డైరెక్టర్ నాగ ఎర్రమల, డిఆర్సిలు మద్దేశ్వరమ్మ, పృథ్వీరాజ్, మధుబాబు, శ్రీకాంత్ ,చెన్నకేశవులు, సూర్యనారాయణ రెడ్డి శిక్షణ ఇచ్చారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

ఆడియో , వీడియో సిడిని ఆవిష్కరించిన ఎస్పి

లైంగిక దాడులను అరికట్టడమే లక్ష్యం

ఆడియో , వీడియో సిడిని ఆవిష్కరించిన ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పిల్లలపై లైంగికనేరాలను అరికట్టడమే తమ లక్ష్యమని జిల్లాఎస్పి జి బిందు మాధవ్ తెలిపారు. గురువారం లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతోనే అవగాహనకు ఆడియో, విడియో సిడిని విడుదల చేశామని ఎస్పి తెలిపారు. బ్యాడ్ టచ్ జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఆడియో , వీడియో సిడిని జిల్లా ఎస్పి ఆవిష్కరించారు. ఎస్పి మాట్లాడుతూ.... చాలా చోట్ల చిన్న పిల్లలపై లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. పసిపిల్లలు బాడ్ టచ్ జరిగినప్పుడు సమాజానికి భయపడి , తల్లితండ్రులకు చెబితే వారు తిడుతారేమోనని, చదువుమానిపిస్తారెమో అని భయపడకుండా డయిల్ 100 కు గాని, డయల్ 112కు ఫిర్యాదు చేయాలన్నారు. టీనేజ్ పిల్లలు ఇంట్లో చెబితే చదువు తల్లిదండ్రులు మాన్పిస్తారెమో అని భయపడి చెప్పడం లేదన్నారు. ధైర్యంగా తల్లిదండ్రులకు, టీచర్లకు, పోలీసులకు, తెలియజేయాలన్నారు. పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. 5 నిమిషాల వీడియో ద్వారా చిన్న పిల్లలకు అవగాహన కల్పించేందుకు కర్నూలు పోలీసులు చర్యలు చేపట్టారన్నారు. పాఠశాలలలో గుడ్టచ్, బ్యాడ్టచ్ , మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మీడియా వారు కూడా తమ వంతుగా పోలీసులకు సహకారం అందించాలన్నారు. ఈ బ్యాడ్ టచ్ వీడియోను మీడియోలో బాగా పబ్లిసిటి వచ్చే విధంగా చూడాలన్నారు. చిన్న పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. మీడియా వారికి , జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బ్యాడ్టచ్ అవగాహన కార్యక్రమంలో ముఖ్యపాత్ర వహించి కృషి చేసిన కోడుమూరు సిఐ తబ్రేజ్ , సంగీత దర్శకులు ఫయూమ్, గాయకుడు కరీముల్లా, డ్యాన్సర్స్, నటీనటులు, పోలీసులు, విద్యార్థులను జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. అడిషనల్ ఎస్పి అడ్మిన్ జి.హుస్సేన్పీరా, కర్నూలు డిఎస్పి బాబు ప్రసాద్, కర్నూలు పట్టణ సిఐలు , ఎస్ఐలు , మహిళా పియస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కొనుగోలుకు రషీదు ఇవ్వాలి

ప్రజాశక్తి-సి బెళగల్

ఎరువుల, మందుల, విత్తనాల దుకాణాలలో రైతులు చేసే ప్రతి కొనుగోలుకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఎఒ మల్లేష్ కుమార్ గురువారం దుకాణదారులకు సూచించారు. ఆయా దుకాణాలను తనిఖీలు చేపట్టి స్టాకు బోర్డును, బిల్లులు రికార్డులను, ధరల బోర్డును పరిశీలించారు. అధిక ధరలకు అమ్మినా, నకిలీ ఎరువులు, మందులు, విత్తనాలు అంతగట్టినా ఎంతటివారికైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాత రోడ్డుపై కొత్త గుంతలు

తవ్వి వదిలేసిన నగర పాలక సంస్థ ఇంజనీర్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గుంతలు పడ్డ 60 అడుగుల రోడ్డుపై కొత్త రోడ్డు వేయాలని నగరపాలక సంస్థ అధికారులను కోరితే పాత రోడ్డుపై కొత్తగా గుంతలు తవ్వి వదిలేసారని స్థానిక కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు న్యాయవాది ఎస్.చంద్రశేఖర్, ఎ.బలరాం రెడ్డి, ఎన్. గోపీనాథ్ విమర్శించారు. అరవై అడుగుల రోడ్డు కోసం రూ.కోట్ల విలువైన స్థలాన్ని నగరపాలక సంస్థకు స్వాధీనం చేసి ఏళ్ల గడుస్తున్నా.. గుంతల్లో మట్టి వేసి రోడ్లను చదువును చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడ వల్ల రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. గురువారం కర్నూలు పిపిఎస్ఎస్ నాయకులతో కలిసి విష్ణు టౌన్షిప్ ప్రాంతంలో పర్యటించారు. వారు మాట్లాడుతూ గుంతలు పడ్డ 60 అడుగుల రోడ్డుపై కొత్త రోడ్డు వేయాలని నగరపాలక సంస్థ అధికారులను కోరితే పాత రోడ్డుపై కొత్తగా గుంతలు తవ్వి వదిలేసారని.. దీనివల్ల రోజు ప్రమాదాల జరుగుతున్నా.. సంబంధిత ఇంజనీరు కాంట్రాక్టర్లు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని. పుల్లారెడ్డి మాట్లాడుతూ నగరంలో రోడ్లలో మరమ్మతుల పేరుతో గుంతలు తవ్వి వదిలివేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురిరౌతున్నారని అన్నారు. నగరపాలక సంస్థలో కొందరు ఇంజనీర్లు ప్రజల సమస్యలపై స్పందించకపోగా పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వెంటనే గుంతలు పడ్డ రోడ్డను బాగు చేయకపోతే జరగరానిది ఏదైననా జరుగుతే పోలీస్ స్టేషన్లలో కేసులు వేస్తామని కొందరు ప్రజలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. కమిషనర్, సూపరిండెంట్ ఇంజనీర్ జోక్యం చేసుకొని వెంటనే గుంతలు పడ్డ రోడ్లను బాగు చేయించాలని కోరారు. ఈ పర్యటనలో ఎన్.గోపీనాథ్, ఎస్.అజ్జు, ఎన్.రఘురామిరెడ్డి, ఎస్.కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు గుంతలను పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెల 9న గర్భిణీ స్త్రీలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి కమిటీ మెంబర్ బత్తిని లోకనాథ్ తెలిపారు. గురువారం స్కానింగ్ నిమిత్తం వచ్చిన గర్భిణీల స్త్రీలకు ఆర్డిఒ భరత్ నాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ కల్పన భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆర్డిఒ భరత్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీ స్త్రీలకు ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ భోజన సదుపాయం ఏర్పాటు చేయడం చాలా సంతోషిదగిన విషయమని అన్నారు. డాక్టర్ కల్పన మాట్లాడుతూ 140 మంది గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందోలు రంగప్ప, ఎరుకలచెరువు సురేంద్ర ,తిక్క రమేష్, చిన్న, దేశాయి రవికుమార్, కప్పే అనిల్ , తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూనియర్ రోల్బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాయలసీమకు తలమానికమైన కర్నూలు నగరంలో రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో తొలిసారిగా 16వ జాతీయ జూనియర్ రోల్బాల్కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. కర్నూలు లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాల ఆవరణలో ఆర్బిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్రఅధ్యక్షులు అయిన జి.చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహిస్తున్నాయి. ఈనెల 9న నుంచి 11 వరకు నిర్వహిస్తామన్నారు. గురువారం ఉదయం జరిగిన ప్రారంభోత్సవంలో రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, నగరూరి రాఘవేంద్ర, చంద్రమౌళి, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఆర్బిఎఫ్ఐ శిక్షకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 20 రాష్ట్రాల నుండి వచ్చిన సుమారు 640 మంది క్రీడాకారులు ఈ పోటీలలో తలపడుతున్నారు. సుదూర రాష్ట్రాలైన జమ్మూ కాశ్మీర్, అస్సాం, ఝార్ఖండ్ , ఒరిస్సా, మేఘాలయ వంటి రాష్ట్రాల నుండి కూడా క్రీడాకారులు పాల్గొనడం విశేషం. జి. పుల్లయ్య మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకు, క్రీడాకారులకు స్వాగతం పలుకుతూ వారి క్రీడా స్ఫూర్తిని అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు అనేకం నిర్వహించవలసిన ఆవశ్యకత ఉందని తెలిపారు. రిడ్జ్ పాఠశాల యాజమాన్యంగా 20 రాష్ట్రాలకు సంబంధించిన క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం తమకు సంతోషాన్ని, స్ఫూర్తిని ఇచ్చిందని తెలిపారు. నగరూరు రాఘవేంద్రరావు మాట్లాడుతూ కర్నూలులో జాతీయస్థాయి క్రీడలు నిర్వహించడం చాలా గర్వకారణం అన్నారు. జాతీయ ఉపాధ్యక్షులు చంద్రమౌళి మాట్లాడుతూ 16వ జూనియర్ రోల్ బాల్ క్రీడలు ప్రారంభమైనట్లుగా అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అనంతరం రాష్ట్రాల వారీగా క్రీడాకారులు కవాతు నిర్వహించి , క్రీడా స్ఫూర్తితో క్రమశిక్షణతో మెలుగుతామని ప్రతిజ్ఞ చేశారు. రిడ్జ్ పాఠశాల సిఇఒ గోపినాథ్, కో సిఇఒ సౌమ్య గోపినాథ్, పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్, నిర్వాహకులు సునీల్ రెడ్డి, మంజునాథ్, అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

16వ జూనియర్ రోల్బాల్ జాతీయ చాంపియన్షిప్ పోటీల వేదికపై అతిథులు

నేడు సంక్రాంతి ముగ్గులు పోటీలు

ప్రజాశక్తి-పత్తికొండ

సంక్రాంతి పండుగ సందర్భంగా పత్తికొండ శ్రీరామహాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ ఎండి నీలకంఠ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలను ఉత్సాహపరచాలనే ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5016 ఒక చీర, రెండో బహుమతి రూ.3016, మూడో బహుమతి రూ.2016 బహుమతిగా ఇస్తామన్నారు. ముగ్గుల పోటీలకు వచ్చేవారు వారు సొంతంగా కలర్లతో కూడిన ముగ్గు పొడి వారే తీసుకొని రావాలని అన్నారు. ముగ్గుల పోటీలో అంపైర్ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలు కింద కనపర్చిన కాంటాక్ట్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. 9885713805,9885467692.



ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆదర్శ విద్యా మందిర్ హైస్కూలులో ముందస్తు సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ బి. తిమ్మయ్య పాల్గొన్నారు.విద్యార్థినీ, విద్యార్థులకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, హరిదాసు కీర్తనల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని బహుమతులతో అభినందించారు. విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, ప్రిన్సిపల్ రమాదేవి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను పిల్లలకు చిన్నతనం నుంచి పరిచయం చేయాలని ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లలలో మానసిక పరిణతి వస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్ఛార్జీలపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : విద్యుత్ సర్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఎపి ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఇ ఎం.ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వయాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ , రిటైల్ సరఫరా లైసెన్స్ కలిగిన డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా వ్యాపారానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, టారిఫ్ , క్రాస్ సబ్సిడీ సర్ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా చివరి రోజు ఈనెల 10 శుక్రవారం స్థానిక విద్యుత్ నియంత్రణ మండలి భవనంలో ప్రజాభిప్రాయ సేకరణ వ్యక్తిగతంగా నేరుగా ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు , మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 03:00 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిదప సాయంత్రం 03:00 గంటల నుంచి 04:30 ని.ల వరకు అభిప్రాయాలు, సలహాలపై సంబంధిత డిస్కంల చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ వారి వివరణ ఉంటుందన్నారు. చివరగా మీడియాకు వివరిస్తామన్నారు.

నేమకల్లు పాఠశాలలో సమస్యల తిష్ట

- ప్రహరీ దూకి అసాంఘిక కార్యకలాపాలు
- రూము తాళం పగులగొట్టి టివి చూసిన దుండగులు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామంటున్న ప్రధానోపాధ్యాయులు
- ఈ సంఘటనలు చూసి నివ్వెరపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - చిప్పగిరి

నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. కొంతమంది దుండగులు ప్రహరీ దూకి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. రూమ్ తాళం పగులగొట్టి టివి చూశారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామంటున్న ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఈ సంఘటనను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు నివ్వెరపోతున్నారు.

మండలంలోనే పేరొందిన పాఠశాల.. నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఇది ఒకప్పటి మాట అని, రాను రాను పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువ అవుతున్నట్లు గ్రామంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. పాఠశాలలో అడుగడుగునా సమస్యలు తాండవిస్తున్నాయి. వాటర్ ఫిల్టర్ ఆరు నెలల నుంచి మరమ్మతులో ఉండడంతో విద్యార్థులకు తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలిసి ప్రధానోపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ ఆదేశించినప్పటికీ నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశాలు అమలు కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఒకరోజు కాదు.. రెండు రోజులు కాదు.. లేక వారం రోజులు కాదు నెలల తరబడి తాగునీరే లేదు. ఇంటి దగ్గర నుంచే విద్యార్థులు బాటిల్ ద్వారా తెచ్చుకుంటున్న దుస్థితి ఉంది. 'కలెక్టర్ చెబుతారు.. డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి.. ఊరికే కలెక్టర్ మీటింగ్‌లో చెబితే సరిపోతుందా...' అంటూ కలెక్టర్ ఆదేశాలను ప్రధానోపాధ్యాయులు తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాత్రి సమయాల్లో పాఠశాలలోకి దుండగులు చేరి డిజిటల్ టివి ఓపెన్

నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాత్రి సమయంలో గత నాలుగు రోజుల క్రితం గేటు తాళాలను పగులగొట్టి డిజిటల్ టివి ఓపెన్ చేసి, ఫిలిమ్ బొమ్మలను చూసి వెళ్లినట్లు నేమకల్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం విలేకరులు వెళ్లి ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించగా, సరైన సమాధానం చెప్పకుండా దాట వేస్తూ.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఎంఇఒకు సమాచారం అందించాలని, తప్పుడు సమాచారం విలేకరులకు తెలిపారు. వెంటనే ఎంఇఒ సావిత్రిని చరవాణి ద్వారా పాత్రికేయులు వివరణ కోరగా... తమకు ప్రధానోపాధ్యాయులు ఎలాంటి సమాచారాన్ని ఇవ్వలేదంటూ వివరణ ఇచ్చారు. నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెడుతున్న ప్రధానోపాధ్యాయులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే స్కూల్ మెయింటనెన్స్ గ్రాంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా అకౌంట్‌కు జమ చేసుకొని డ్రా చేశారని, కానీ వాటర్ ఫిల్టర్ మాత్రం మరమ్మతులు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని విద్యార్థులు, తల్లిదండ్రులు బహిరంగంగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుల అవినీతి, అక్రమాలపై, ఇటీవల గేటు తాళాలు పగులగొట్టి దుండగులు ప్రవేశించి మద్యం సేవించి, డిజిటల్ టివి ఓపెన్ చేసి వ్యవహరించిన శైలిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సిసి కెమెరాలను అమర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలో మూలన పడిన ఫిల్టర్ వాటర్ కేంద్రం

స్టీఫెన్ హాకింగ్ భావి శాస్త్రవేత్తలకు స్ఫూర్తి

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న జెవివి జిల్లా అధ్యక్షులు శంకరయ్య

స్టీఫెన్ హాకింగ్ నేటి, భవిష్యత్తు తరాల శాస్త్రవేత్తలకు స్ఫూర్తి అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్ తెలిపారు. గురువారం ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్టీఫెన్ హాకింగ్ జయంతి నిర్వహించారు. ముందుగా స్టీఫెన్ హాకింగ్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లాడారు. స్టీఫెన్ హాకింగ్ అరుదైన నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ, చివరకు శరీరం అచేతనమైనా, పని చేయలేని పరిస్థితిలో ఉన్నా పనిచేసే మెదడుతో చక్రాల కుర్చీతోనే జీవితం అత్యధిక భాగం గడిపారని తెలిపారు. ప్రస్తుత పుడిమిపై నివసిస్తున్న మానవుడు భవిష్యత్ తరాల కోసం ఇతర గ్రహాలపై నివసించాల్సిన పరిస్థితులు వస్తాయని, అందుకనుగుణంగా మానవుడు శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. జెవివి జిల్లా అధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ... సమాజంలో ఇప్పటికీ మూఢనమ్మకాలు ఉన్నాయని, విద్యార్థులు శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకొని, భవిష్యత్ తరాలు శాస్త్రీయ పౌరులుగా రూపొందేటట్లు కృషి చేయాలని తెలిపారు. జెవివి నాయకులు బిజి.మాదన్న మాట్లాడుతూ... మానవ సమస్యలను విద్య.. అందులో శాస్త్రీయ విద్య పరిష్కరిస్తుందని తెలిపారు. నేటి విద్యార్థులు మంచి విద్యనభ్యసించి దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఉపన్యాసకులు రాజశేఖర్ రెడ్డి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. కళాశాల ఉపన్యాసకులు రమేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

'కూటమి'తో రహదారులకు మహర్దశ

- టిడిపి సీనియర్ నాయకులు మేకల రామాంజనేయులు

ప్రజాశక్తి - చిప్పగిరి

సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

దశాబ్దాలుగా రహదారులకు నోచని గ్రామాల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిసి రహదారులు రూపు దిద్దుకుంటున్నాయని టిడిపి సీనియర్ నాయకులు మేకల రామాంజనేయులు, రాజశేఖర్, ప్రభాకర్ తెలిపారు. గురువారం దౌల్తాపురం గ్రామంలో రూ.10 లక్షల ఉపాధి నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ సహకారంతో తమ గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. బీసీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ భారతి, సుంకన్న, లింగన్న, శరవరి, లక్ష్మన్న, నీలకంఠ, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు చర్యలు

- ఎంపిడిఒ గౌరీదేవి

దేవనకొండలో మాట్లాడుతున్న ఎంపిడిఒ గౌరీదేవి

ప్రజాశక్తి- దేవనకొండ

గ్రామాల్లో బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ గౌరీదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత కోరారు. కిశోర బాలిక వికాసంపై మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎస్‌కె, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌమార దశలో బాలికల్లో వచ్చే మార్పులు, ఆరోగ్య జాగ్రత్తలు, బాలికల విద్యాభివృద్ధి తదితర అంశాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. పెళ్లి వయస్సుతో సంబంధం లేకుండా బాలికల తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తున్నారని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఇఒ విజయనిర్మల, తిమ్మారెడ్డి, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి, ఎపిఎం నరసన్న పాల్గొన్నారు.

హొళగుంద

హొళగుంద ఎంపిడిఒ కార్యాలయంలో కిశోరి వికాసం నిర్వహించారు. ఇఒఆర్‌డి చక్రవర్తి, ఎంఇఒ-2 జగన్నాథం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శోభారాణి మాట్లాడుతూ... కిశోర్ బాలికల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో 15 మంది కిశోర బాలికలతో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆ కమిటీల నుంచి గ్రామాలవారీగా సంఘాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

అంతా మా ఇష్టం..!

- సిఎంకు చెప్పుకోండి - అక్రమ మట్టి తవ్వకాల నిర్వాహకుడు

ప్రజాశక్తి - మంత్రాలయం

'అంతా మా ఇష్టం.. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబుకే చెప్పుకోండి' అంటూ అక్రమ మట్టి తవ్వకాల నిర్వాహకుడు మల్లేష్ పాత్రికేయులపై చిందులు వేశారు. గురువారం మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన సుమారు 10 ట్రాక్టర్లతో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. కవరేజ్ కోసం వెళ్లిన పాత్రికేయులపై 'ప్రభుత్వం మాది. మమ్మల్ని ఎవరూ, ఏమీ చేయలేరు' అంటూ, 'ఎన్నాళ్లు ఇలా భయపడి బతకాలి' అంటూ కవరేజ్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై వీడియో తీశారు. జెసిబి ద్వారా బసులదొడ్డి రిజర్వాయర్ వద్ద మట్టి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. కరకట్ట అంచున తవ్వడం వల్ల కరకట్ట ప్రమాదం అంచున ఉన్నట్లు తెలిసింది. జెసిబి ద్వారా మట్టిని పెకలించి ట్రాక్టర్లను తరలిస్తున్నారు. ఈ విషయంపై స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మట్టిని తవ్వుతున్న నిర్వాహకుడు

'రజక' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని శ్రీసిద్ధేశ్వర స్వామి గుడి ఆవరణలో గురువారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చాకలి మంగయ్య, ఎల్ఐసి లక్ష్మణి, మల్లికార్జున, మహేష్ మాట్లాడారు. రాష్ట్రంలో రజకులకు సామాజిక భద్రత లేదని, రజకులపై దాడులు, మహిళలు, బాలికలపై అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. వీటిని అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఉదయ్, కరెంటు మల్లి, సున్నం వీరేష్, నాగప్ప, ఎల్లప్ప, శివ, శేఖర్, హనుమేష్, కృష్ణ, రమేష్, రంగస్వామి, రాజా, గాది మల్లి, మంజు, రమేష్, రామకృష్ణ, ప్రకాష్, రాము, వీరేష్, కుబేర, రాజశేఖర్, రవి పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల జారీలో

అప్రమత్తత అవసరం : మాల మహానాడు

ప్రజాశక్తి - ఆదోని

ఎస్సీ ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయిస్తామని మాల మహానాడు లీగల్ అడ్వయిజర్ అడ్వకేట్ చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం హెచ్చరించారు. గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాదాసి/మాదారి కురువలను కులగణన నుంచి తొలగించాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తే క్రిమినల్ కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు నాయకులు బసాపురం ఎల్లప్ప, భరత్, విజయ్, చాగి గుళ్లెప్ప ఉన్నారు.

అక్రమాల చిట్టా విప్పుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కనుసన్నల్లోనే అక్రమ రిజిస్ట్రేషన్లు, భూ మాఫియా సాగిందని, వాటి చిట్టా మొత్తం సిద్ధం చేశామని, త్వరలోనే విప్పుతామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోనిలో వెలుగు చూసిన అక్రమ రిజిస్ట్రేషన్‌కు కారకులైన అధికారులను సస్పెండ్ చేయడం, ఇంకా జైలు పంపినట్లు తెలిపారు. అసలైన వారి కోసం పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారని చెప్పారు. ఆదోని ప్రజల ఆస్తుల జోలికి ఎవరైనా వస్తే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎవరైనా రిజిస్టర్ చేసుకోవాలంటే అన్ని రికార్డులూ సక్రమంగా ఉన్నా మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అనుమతి లేనిదే పనులు జరిగేవి కాదని తెలిపారు. గత 8 నెలల్లో ఇలాంటివి ఏమైనా జరిగాయా అని ప్రశ్నించారు. గతంలో విలువైన భూములకు రెడ్ మార్కులు వేయడం, వాటిని వివాదాస్పదం చేయడం, ఆన్‌లైన్‌లో లేకుండా చేయడం జరిగేదన్నారు. ఇలా అనేక అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, ప్రజల ఆస్తులను దోచుకున్నారని తెలిపారు. ఇప్పటికే తాము తప్పుడు రిజిస్ట్రేషన్లను రద్దు చేయించినట్లు చెప్పారు. 321ఎలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేసి బాధితులు ఈశ్వరప్పకు అండగా ఉంటామన్నారు. గతంలో వారు చేసిన అక్రమాల వల్ల అనేక సర్వే నెంబర్లు వివాదాస్పదంగా మారాయన్నారు. సర్వే నెంబర్లు 352, 354, 303, 504, 341, 342, 444, 355, 44, 43ఎ, 46ఎ 2లో అనేక అక్రమాలు చేశారని తెలిపారు. ఇందులో మొత్తం మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందన్నారు. అక్రమార్కుల వల్ల భూములు కోల్పోయిన వారికి తిరిగి ఇప్పిస్తామని, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. గత మూడు నెలలుగా సబ్ రిజిస్ట్రార్ హాజీమీయా అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయని, గత మూడు నెలల్లో జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలనలో ఉంచాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మల్లప్ప, బిజెపి జిల్లా అధ్యక్షులు నీలకంఠ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ, బిజెపి రాష్ట్ర నాయకులు విట్టా రమేష్, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఫక్రుద్దీన్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

విద్యా ప్రోత్సాహకులు గుండారెడ్డి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

గుండారెడ్డి (ఫైల్)

విద్యార్థులు విద్యా రంగంలో రాణిస్తున్నారంటే అలాంటి విద్యార్థులను ప్రోత్సహించి ముందుకు నడిపే ఆర్ఎం.గుండా రెడ్డి(60) మృతి చెందారు. మండలంలోని రౌడూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి సోదరుడు ఆర్ఎం.గుండా రెడ్డి ఆదోని పట్టణంలోని ప్రయివేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేశారు. ఆదోని లక్ష్మమ్మ బ్యాంకు డైరెక్టర్‌గా, ఓల్డ్ మెడలిస్ట్ కన్వీనర్‌గా కొనసాగారు. పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా వచ్చిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేవారు. ఎంతోమంది విద్యార్థుల ఉన్నత విద్య కోసం సహాయ, సహకారాలు అందించేవారు. ఆర్ఎంఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు అందించారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యానికి గురి కావడంతో బళ్లారి, బెంగళూరులో చికిత్స పొందారు. గురువారం మృతి చెందినట్లు సోదరుడు సుధాకర్ రెడ్డి వెల్లడించారు. ఈయన మృతి పట్ల అనేకమంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి

- టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

తిరుమలలో జరిగిన ఘటనలోని క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ ఆకాంక్షించారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తిరుమల తిరుపతి శ్రీవారిని వైకుంఠ ఏకాదశీ రోజు దర్శించుకోవాలని టోకెన్లు తీసుకునేలోపే ఈ ఘటనలో మరణాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సిసి బ్రిడ్జి నిర్మించాలి

- ఎల్‌ఎల్‌సి జెఇకి గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని అగ్రహారం ఆంజనేయ స్వామి గుడికి వెళ్లే భక్తులకు, రైతులకు కాలువ దాటే ఐరన్ బ్రిడ్జి శిథిలమైందని, దాని బదులుగా సిమెంట్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు, రైతులు కోరారు. గురువారం ఎల్ఎల్‌సి జూనియర్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో నిర్మించిన ఐరన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియదని అన్నారు. బ్రిడ్జి దాటడానికి భక్తులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సిమెంట్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని కోరారు.

మహారాజశ్రీ కర్నూలు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వారి కోర్టులో

ఓ.యస్. నెం. 199/2017

శ్రీమతి.వి.సుగుణ దేవి. ...వాది

-ఎదురి-

వి.రమేష్ మరియు ఇతరులు. ...ప్రతివాదులు

7వ ప్రతివాది కి దావా సమన్లు

7) బెల్లంకొండ రంగస్వామి తండ్రి బి రంగన్న, ఓ.సి.సి. సర్వీస్, ఆంధ్ర బ్యాంక్ (ప్రస్తుతము) ఇండియన్ బ్యాంక్, రీజినల్ ఆఫీస్, కర్నూలు

పై దావలోని వాది తనకు చెందవలసిన ఆస్తి బాగా పరిష్కారము నిమిత్తము ప్రతివాదులు 1 నుండి 9 వరకు పైన కన పరచిన వాది మీ పైన దావా దాఖలు చేసియున్నారు . ఇందులో 7వ ప్రతివాది అయినా మీకు సమన్లు ముట్టనందున కోర్టు వారు ఈ పత్రిక పరంగా సమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కావున పై దావా పై మీకు ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల 27-1-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు కాని మీ తరపు వకీల్ ద్వారా కాని హాజరై తెలుపు కొనగలరు. లేనియెడల సదరు దావ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 27-1-2025

సి.ఎన్.మూర్తి ,
ఎస్.బాబు సాహెబ్,
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు.

మహారాజ శ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి : కర్నూలు

IA No.28/2024 in A.S.No.32/2019

1) రెహమత్ బి మరియు ఇతరులు.
...అర్జీదారులు/ అప్పిలెంట్స్

-Vs-

1) చాకలి గిడ్డయ్య (మరణం) మరియు ఇతరులు.
...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్

నోటీస్ టు రెస్పాండెంట్స్ నెం.8కు

U/O 1. Rule,10 (2) of CPC ప్రకారం

బండ సరస్వతి D/o బి.వెంకట రాముడు, ఇంటి డోర్ నెం.1/20, బి.తాంద్రపాడు గ్రామము, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.

పై అప్పిల్ దావా నెం.32/2019 నందు రెస్పాండెంట్స్ నెం.8గా మిమ్మల్ని చెర్చమని అర్డరు 01 రూల్ 10 (2) ఆఫ్ సి.పి.సి కోర్టు నందు అర్జీదాఖలు చేయడం అయినది. ఇందు విషయమై పలుమార్లు కోర్టు సమానులు పంపినా మీరు తీసుకొనందుకు గాను కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పత్రిక ముఖమున మీకు సమనులను తెలుపడం అయినది.

ఇందు విషయమైన మీకు ఏమి అయిన అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా రోజు 23/01/2025 నాడు పై కోర్టు నందు హాజరు అయ్యి తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున ఈ అర్జీని తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

ఇట్లు
యం.ఆర్.క్రిష్ణ,
కె.నాగరాజు,
అర్జీదారుల న్యాయవాదులు,
కర్నూలు.

పంటలు ఇంటికొచ్చే వేళ సంబరాలు...

ప్రజాశక్తి - ఆలూరు

రైతులు పండించిన పంటలు ఇంటికొచ్చే వేళ.. సంక్రాంతి సంబరాలు జరుపుకుంటారని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, యుటిఎఫ్ మండల కార్యదర్శి రూపలత, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంయుక్త తెలిపారు. గురువారం యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరిట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటిఐ కళాశాల, ఎపి మోడల్ స్కూల్, గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినులకు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంక్రాంతి పండగ ప్రత్యేకత విద్యార్థులకు వివరించారు. రైతులు పండించిన పంటలు ఇంటికి తీసుకొచ్చే ముందు నెలరోజుల ముందు నుంచే పండగ హడావిడి మొదలవుతుందని తెలిపారు. ప్రతి ఇంటి ముందూ రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో స్వాగతం పలుకుతూ వేకువ జామున హరిదాసు నెలంతా వస్తారని చెప్పారు. గంగిరెద్దులు, ఎడ్ల పందేలు ఒక్కమాటలో చెప్పాలంటే సాంప్రదాయం మొత్తం ఈ పండగలో ప్రతిబింబిస్తుందని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. యుటిఎఫ్ నాయకులు వాహిద బేగం, ఉపాధ్యాయులు శైలజ, అరుణ, కళావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉమేష్, గిరిమూర్తి, నాయకులు బసవ, షాషావలీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

- బహుమతులు అందజేసిన బారికి చంద్రశేఖర్ ఛారిటబుల్ ట్రస్ట్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బారికి చంద్రశేఖర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పాఠశాల బాలికలు పోటీ పడి రంగవల్లులను తీర్చిదిద్దారు. అద్భుతమైన ముగ్గులతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణ్ రెడ్డి అధ్యక్షతన బహుమతుల ప్రదానం చేపట్టారు. బారికి చంద్రశేఖర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బారికి చంద్రశేఖర్, ప్రముఖ న్యాయవాది కె.మురళీకృష్ణ, జాతీయ ఎన్‌టిఆర్ అవార్డు గ్రహీత బైలుప్పల షఫీవుల్లా, శాప్ నెట్ మాజీ ఛైర్మన్ మాచాని వెంకటేష్, దాత ఈరన్న గౌడ్ హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో అంజలికి మొదటి బహుమతి, ఐశ్వర్యకు రెండో బహుమతి, తులసికి మూడో బహుమతి, పావనికి నాలుగో బహుమతి, సుహానా బేగం అయిదో బహుమతి అందజేశారు. 20 మంది బాలికలకు బారికి చంద్రశేఖర్ ఛారిటబుల్ గౌరవ అతిథుల చేతులమీదుగా మెమెంటోలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణ రెడ్డి స్టేట్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, ముఖ్య అతిథులు మురళీకృష్ణ, బైలుప్పల షఫీవుల్లా, బారికి చంద్రశేఖర్, మాచాని వెంకటేష్, రవి ప్రకాష్, శ్రీనివాస్, భూపతి రాజు, హరినాథ్, పార్వతి, సుప్రియ, ట్రస్ట్ సభ్యులు చిన్నారులను ఆశీర్వదించి, బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు

'నారాయణ ప్రైమ్'లో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని నారాయణ ప్రైమ్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను కరస్పాండెంట్ నరేష్ ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాలలో ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వేసి విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ మాట్లాడారు. సంక్రాంతికి ఒక రోజు ముందు భోగి పండగతో సంబరాలు మొదలవుతాయని తెలిపారు. భోగి అంటే భోగభాగ్యాలను అనుభవించే రోజు అని అర్థమని చెప్పారు. ఎలాగంటే పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే కాలమని అన్నారు. తెలుగు ప్రజలు జరుపుకొనే అతిపెద్ద పండగ సంక్రాంతి అని, ముఖ్యంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజలు ఈ పండగను నాలుగు రోజులపాటు జరుపుకుంటారని తెలిపారు. గొబ్బెమ్మలు, భోగి మంటలు, గంగిరెద్దులు, పిండి వంటలు, హరిదాసు కీర్తనలు, రథం ముగ్గులు, కోడి పందేలు, ఇలా సంకాంత్రి వచ్చిందంటే ఆ సందడే వేరని చెప్పారు. ఈ పండగ తొలి రోజును భోగి అని పిలుస్తారని, రెండో రోజును మకర సంక్రాంతిగా, మూడో రోజు కనుమగా పిలుస్తారని తెలిపారు. అకడమిక్ డీన్ నిజాం, ఉపాధ్యాయులు లావణ్య, గాయత్రి, నిర్మల, రమాదేవి, అంజినమ్మ, తులసి, భవాని, పద్మావతి, నవీన్ పాల్గొన్నారు.

వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

వాలంటీర్లను ఎప్పుడు కొనసాగిస్తారు..?

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు వాలంటీర్లను ఎప్పుడు కొనసాగిస్తారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎపి గ్రామ/వార్డు వాలంటీరు యూనియన్ (సిఐటియు) నాయకులు సురేష్ ప్రశ్నించారు. గురువారం వాలంటీరు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పద్మశాలి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్లను కొనసాగిస్తామని గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు హామీఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 'వాలంటీరు వ్యవస్థ లేదు.. పేరు లేదు..' అంటూ వాలంటీర్లను అవమానపరిచే విధంగా మాట్లాడడం సరైనది కాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు చెల్లించాలని, వాలంటీర్లను కొనసాగించి ఎన్నికల హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాజీనామా చేయించిన వారిని కూడా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎపి గ్రామ/వార్డు వాలంటీర్స్ యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ గౌరవాధ్యక్షులుగా సురేష్, కార్యదర్శిగా నవీన్, అధ్యక్షులుగా శిరీష, ఉపాధ్యక్షులుగా సాధిక్, లక్ష్మి, విజయ్ కుమార్, సహాయ కార్యదర్శిగా వీరేష్, హరి, ఇస్మాయిల్, కుమార్, కమిటీ సభ్యులుగా మధు, నాగేంద్ర, శివ, గిరి, గఫూర్, నరసన్న, కల్యాణ్, పవిత్ర, ఈరమ్మ, జ్యోతి, రాజేశ్వరి, ఈశ్వరి, 30 మందిని ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

ఘనంగా రేఖగౌడ్‌కు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందవరం

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖగౌడ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ మండల నాయకులు సి.ఎల్లప్ప ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రేఖగౌడ్ నివాసంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె సుఖసంతోషాలతో జీవిస్తూ జనసేన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ అధినేత కల్యాణ్ అడుగు జాడల్లో నడవాలని ఆయన ఆకాంక్షించారు. చంద్ర, అంజి, ఇర్ఫాన్, బంగారి, రామలింగడు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఇసుక అక్రమ రవాణాపై తహశీల్దార్ చర్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై తహశీల్దార్ ఎస్.రవి చర్యలు చేపట్టారు. గురువారం తహశీల్దార్ స్వయంగా తుంగభద్ర నదీతీరానికి చేరుకొని ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న హమాలీలను సైతం పోలీసులకు అప్పగించారు. పోలీసుల ద్వారా మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేయాలని పోలీసులకు తెలిపారు.

హెచ్చరిస్తున్న తహశీల్దార్

ఫాతిమా షేక్ సేవలు చిరస్మరణీయం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

భారతీయ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయులు ఫాతిమా షేక్ సేవలు చిరస్మరణీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫాతిమా షేక్ బాలికల చదువు కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. సావిత్రి బాయితో కలిసి, ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేశారని చెప్పారు. ఎన్నో అవమానాలు, భౌతిక దాడులు, వేధింపులకు గురైనా లక్ష్యాన్ని మాత్రం వదులుకోలేదన్నారు. ఎక్కడ అవమానం ఎదుర్కొన్నారో అక్కడే ఆమె గౌరవం పొందారని కొనియాడారు.

నివాళులర్పిస్తున్న నాయకులు